
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఖమ్మం
KHAMMAM

సోమవారం, 7 ఏప్రిల్ 2025



కల్యాణాన్ని తిలకిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి దంపతులు




భద్రాచలంలో సీతమ్మవారికి మాంగళ్య ధారణ

పరవశించిన భద్రాద్రి



భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక



కల్యాణ వేడుకలో సీఎం దంపతులు



మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకుడు

కనుల పండువగా సీతారాముల కల్యాణం

- తిలకించి పులకించిన భక్తజనం
- శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా సాగిన కల్యాణ తంతు
- ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు
- వేడుకకు హాజరైన మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రముఖులు
- పోటెత్తిన భక్తజనంతో కిటకిటలాడిన రామక్షేత్రం

భద్రాచలం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి అపర మిథిలానగరమై శోభిల్లింది.. పావన గౌతమీ తీరం భక్తజనంతో పోటెత్తింది... జగదానంద కారకుడు శ్రీరాముడి కల్యాణ వేడుక సీతమ్మ వారితో అంగరంగ వైభవంగా జరిగింది. విశ్వావసు నామ సంవత్సర నవమి పర్వదినాన సీతారాముల కల్యాణం ఆదివారం కనుల పండుగగా నిర్వహించారు. భక్తరామదాసు చేయించిన మూడు సూత్రాలతో ఉన్న మంగళసూత్రాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ భక్తజన కోటి కనులారా తిలకిస్తుండగా సీతమ్మ వారికి ధారణ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలు మూలల నుంచి భక్తజనం తరలివచ్చారు.

ఆదివారం తెల్లవారుజాము నుంచి మొదలైన కల్యాణ తంతు మధ్యాహ్నం వరకు శాస్త్రోక్తంగా సాగింది. తెల్లవారుజామున 2 గంటలకే ఆలయాన్ని తెరిచి స్వామి వారికి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం తిరువారాధన, ఆరగింపు, మంగళశాసనం, అభిషేకం జరిపారు. తదుపరి ధ్రువమూర్తులకు కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ శ్రీధర్ పాల్గొన్నారు. అనంతరం 9.14కి కల్యాణమూర్తులను పల్లకిలో ఉంచి మంగళవాయిద్యాలు, కోలాటాలు, వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ఊరేగింపు ప్రారంభమైంది. మిథిల స్టేడియంలోని కల్యాణ మండపానికి 9.45 గంటలకు తీసుకొచ్చారు. భక్తుల జయ జయ ధ్వానాల నడుమ స్వర్ణ సింహాసనంపై స్వామివారిని, అమ్మవారిని ఆసీనులను గావించారు. ముందుగా తిరువారాధన, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించి మండప శుద్ధి గావించారు. ఈ సమయంలో ప్రత్యేక మంత్రాన్ని జపిస్తూ వేద పండితులు సంకల్పంతో స్వామి వారికి ఎదురుగా సీతమ్మను కూర్చోబెట్టి కన్యావరణలు జరిపారు. రక్షాబంధనం, ప్రతిసర బంధనం, ద్వితీయ సువర్ణ యజ్ఞోపవీత ధారణ జరిపారు. యోక్త బంధనం, వధూవరుల (మిగతా 6వ పేజీలో)

రామాలయంలో నేడు...

- తెల్లవారుజామున 4 నుంచి 4.30 వరకు ఆలయం తెరుచుట, సుప్రభాత సేవ
- 4.30 నుంచి 6.30 వరకు ఆరాధన, నివేదన, శాత్తుముర్రై(దర్శనం లేదు)
- 9.30 నుంచి 10.30 వరకు శ్రీ సీతారాముల ఉత్సవమూర్తులను ఆలయం నుంచి ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకెళ్లుట.
- 10.30 నుంచి 12.30 వరకు శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం
- 12.30 నుంచి 1.00 వరకు కల్యాణ మండపం నుంచి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లుట
- 1నుంచి 2గంటల వరకు మధ్యాహ్నిక, ఆరాధన, రాజభోగం, తలుపులు వేయుట (దర్శనం లేదు)
- 3 నుంచి 6 వరకు సర్వ దర్శనం, శీఘ్ర దర్శనం (ఒకరికి రూ. 100)
- 6 నుంచి 6.30 వరకు ఆరాధన
- 6.30నుంచి 9.30వరకు సర్వదర్శనం (ఉచితం)
- 7 నుంచి 9.30 వరకు రథోత్సవం
- 10 నుంచి 10.30 వరకు ఆరగింపు, శాత్తుముర్రై, తలుపులు వేయుట



రామాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

నేడు గవర్నర్ రాక



భద్రాచలంలో సోమవారం జరిగే శ్రీరామ మహా పట్టాభిషేకంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున గవర్నరు జిష్ణుదేవ్ వర్మ పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. సోమవారం ఉదయం 9.40 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకొని 9.45కి భద్రాచలం బయలుదేరుతారు. 10.45కు భద్రాచలం చేరుకుంటారు. 10.50కి ఐటీసీ అతిథి గృహానికి చేరుకొని, 11 నుంచి 11.20 వరకు అక్కడే విశ్రాంతి తీసుకుంటారు. 11.20కి రోడ్డు మార్గం ద్వారా వచ్చి రామాలయం చేరుకుంటారు. 11.30 నుంచి 11.40 వరకు స్వామి దర్శనం చేసుకుని 11.45కి పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొంటారు. 11.45 నుంచి 12.45 వరకు పట్టాభిషేకం వేడుకను తిలకిస్తారు.



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న సీఎం, పక్కన మంత్రి తుమ్మల



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి సురేఖ, సీఎస్



జిల్లా జైలును పరిశీలిస్తున్న డీజీ సౌమ్యా మిశ్రా

జైలును సందర్శించిన డీజీ

వసతి, సదుపాయాల పరిశీలన

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని దానవాయిగూడెం వద్ద ఉన్న జిల్లా జైలును ఆదివారం జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్యమిశ్రా సందర్శించారు. ఆమె వెంట వరంగల్ రేంజ్ డీఐజీ ఎం.సంపత్ కూడా వున్నారు. ఈ సందర్భంగా జైల్లో ఉన్న వసతులను, ఖైదీల గదులను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. అన్ని సదుపాయాలతో పాటు న్యాయసహాయం సరిగా అందుతోందా.. లేదా.. అని తెలుసుకున్నారు. అనంతరం ఖైదీల మనోవికాసం, వారి ఆరోగ్యం కోసం జైళ్లశాఖ చేపట్టిన స్పోర్ట్స్ మీట్‌పై ఖైదీలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ ఎ.శ్రీధర్, జైలర్లు సక్రు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుడి ఇంట సీఎం లంచ్

- సన్నబియ్యంతో వండిన భోజనాన్ని వడ్డించిన కుటుంబం
- ఉప ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు హాజరు

భద్రాచలం/బూర్గంపాడు ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో సీతారాముల కల్యాణ వేడుకలకు హాజరైన రేవంత్‌రెడ్డి.. రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నుంచి ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం భోజన రుచులు ఎలా ఉంటాయో ఆదివారం స్వయంగా చవి చూశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని ముత్యాలమ్మపేటలో నాయకపోడు గిరిజనుడు బూరం శ్రీనివాసరావు ఇంట్లో సన్నబియ్యం భోజనం రుచులు ఆరగించారు. కల్యాణ కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, రాందాస్‌నాయక్, రాగమయి తదితరులతో కలిసి నేలకూర్చొని ముఖ్యమంత్రితో పాటు మంత్రులు భోజనం చేశారు. భోజనంలో పులిహోర, పాయసం, గోంగూర, ములక్కాయ, దోసకాయ, టమాట కూర, ఆకుకూర పప్పు, సాంబారు, పెరుగు, మజ్జిగ పాయసం స్వీకరించారు. భోజనం బాగుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గిరిజన కుటుంబానికి కితాబు ఇచ్చారు.

ఈ సందర్భంగా శ్రీనివాసరావు తల్లి పద్మావతి... సీఎం రేవంత్‌రెడ్డికి తమ సమస్యలను వివరించారు. తన కొడుకు శ్రీనివాసరావు బీఈడీ చదివినా ఉద్యోగం లేదని, అలాగే కుమార్తె సుహాసిని మతి స్థిమితం సక్రమంగా లేక అనారోగ్యంతో బాధపడుతోందని తెలిపారు. ఇందుకు స్పందించిన రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టరుకు దరఖాస్తు ఇవ్వండి, అన్ని నేను చూసుకుంటాను అంటూ భరోసా ఇచ్చారు.

మధ్యాహ్నం 1.25 గంటలకు బూరం శ్రీనివాసరావు ఇంటికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి... 1.46 గంటల వరకు అంటే దాదాపు 21 నిమిషాలు అక్కడే గడిపారు. సీఎం సన్నబియ్యంతో భోజనం చేసేందుకు సీఎం వస్తున్నారని తెలుసుకొని సారపాకతో పాటు చుట్టు పక్కల ఉన్న



ముత్యాలమ్మపేటలో భోజనం చేస్తున్న సీఎం రేవంత్

గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

రామయ్య ఆశీస్సుల వల్లే సీఎం వచ్చారు..

శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆశీస్సులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ ఇంటికి భోజనానికి వచ్చారని సన్న బియ్యం లబ్ధిదారుడు బూరం శ్రీనివాసరావు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. నిరుపేద కుటుంబమైన తమ ఇంట్లో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు భోజనం చేయడం ఆనందంగా ఉందని ఈ శ్రీరామనవమిని తమ జీవితంలో మర్చిపోలేమంటూ ఆనందం వ్యక్తం చేశారు.

సన్నబియ్యం పథకం అమలు నేపథ్యంలో సన్నబియ్యం రుచిని చూసేందుకు సీఎం, మంత్రులు రాగా.. వారికి సన్నం బియ్యంతో భోజనం, పాయసం, పులిహోర, ఆకుకూర పప్పు, గోంగూర చట్నీ, బెల్లం పానకం, ఇతర ఆహార పదార్థాలను వడ్డించారు. తనివి తీరా భోజనం చేసిన తర్వాత సీఎం... కుటుంబ సభ్యులను అభినందించారు. భోజన సమయంలో కుటుంబసభ్యులతో మమేకమై వారి కుటుంబ పరిస్థితులు, జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.

సీపీఎం నేత యర్రా శ్రీకాంత్

హఠాన్మరణం



- ఈ నెల 2న మధురైలో పార్టీ అఖిల భారత మహాసభలకు పయనం
- అక్కడే తీవ్ర అస్వస్థత.. ఆస్పత్రికి తరలించే లోపే మృతి
- సీపీఎంతో 37ఏళ్ల సుదీర్ఘ అనుబంధం
- నిబద్ధతతో రాష్ట్ర కమిటీ సభ్యుడి వరకు అంచెలంచెలుగా ఎదిగిన నేత

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్(62) ఆకస్మిక మరణానికి గురయ్యారు. పార్టీ అఖిల భారత మహాసభలకై జిల్లా ప్రతినిధి బృందంతో ఈ నెల 2న మధురైకి వెళ్లారు. ఆదివారం మధ్యాహ్న సమయంలో గుండె సంబంధిత వ్యాధితో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సమీపంలోనే ఉన్న రాష్ట్ర సహాయ కార్యదర్శి పోతినేని సుదర్శన్‌రావు, ఇతర బృందం సభ్యులు మధురైలోని హాస్పటల్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య సుకన్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. హమాలీ నేత నుంచి రాష్ట్ర కమిటీ సభ్యుడి వరకు అలుపెరగని నాయకుడిగా శ్రీకాంత్ 37 ఏళ్ల పాటు సీపీఎంలో ఎదిగారు. కార్మిక, ప్రజా ఉద్యమాల్లో కీలకంగా పనిచేశారు. ఇంటర్మీడియట్ వరకు విద్యాభ్యాసం చేసిన శ్రీకాంత్ 1980లో సీపీఎంలో చేరారు. 1991 నుంచి పూర్తిస్థాయి నాయకుడిగా బాధ్యతలు చేపట్టారు. ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ, సీపీఎంలో కీలకంగా పనిచేశారు.

ఖమ్మం త్రీ టౌన్ ప్రాంతంలో పటిష్టమైన పార్టీ నిర్మాణానికి కృషి చేశారు. 2002లో ఖమ్మం నగర కార్యదర్శిగా 2009లో డివిజన్ కార్యదర్శిగా, 2011లో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా, 2019లో రాష్ట్ర కమిటీ సభుడిగా ఎన్నికయ్యారు. విద్యుత్ పోరాటంలో 21 రోజుల పాటు జైలు జీవితం గడిపారు. శ్రీకాంత్ అకాల మృతికి పార్టీ రాష్ట్ర, జిల్లా కమిటీలు ప్రజాసంఘాలు సంతాపం ప్రకటించాయి. కాగా, శ్రీకాంత్ మరణంతో ఆయన కుటుంబం దుఃఖ సముద్రంలో మునిగిపోయింది.

శ్రీకాంత్ భౌతికకాయాన్ని సోమవారం ఖమ్మం తీసుకు రానున్నారు. బుధవారం అంత్యక్రియలు జరుగు తాయని పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేశ్, వెంకటేశ్వరరావు, బండి పద్మ, ఎం.సుబ్బారావు, తుమ్మ విష్ణువర్ధన్, శ్రీనివాసరావు, బండారు రమేశ్, యాకయ్య తదితరులు శ్రీకాంత్ కుటుంబ సభ్యులను ఓదార్చారు.

నేటినుంచి 'పది' మూల్యాంకనం

మొత్తం 2.30లక్షల జవాబుపత్రాలు.. 15 వరకు నిర్వహణ

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలు పూర్తికావటంతో జవాబు పత్రాల మూల్యాంకనాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం నుంచి ఈ నెల 15 వరకు నగరంలోని సెంట్‌జోసఫ్ పాఠశాలలో మూల్యాంకణం నిర్వహించనున్నారు. మొత్తం 2.30లక్షల జవాబు పత్రాలను మూల్యాంకణం చేయనున్నారు. మూల్యాంకణానికి 650 మంది ఏఈలు, వంద మంది సీఈలు, 9 మంది ఏసీఓలు, ఒక డిప్యూటీ క్యాంప్ అధికారితోపాటు క్యాంప్ అధికారిగా జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ వ్యవహరించనున్నారు. రోజుకు ఒకొక్కరు 40 పేపర్లను మూల్యాంకణం చేయావల్సి ఉంటుంది.

అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మినహాయింపు ఇవ్వండి

పదో తరగతి మూల్యాంకణంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు, పదవీ విరమణకు దగ్గర ఉన్న వారికి, ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్న మహిళలకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఆదివారం జిల్లా విద్యాశాఖ అధికారికి పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు వినతిపత్రం సమర్పించారు. ఈ విషయమై డీఈవో సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

తల్లాడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం గోపాలపేట సమీపంలోని ఎన్నెస్పీ ప్రధాన కాల్వలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఆదివారం తల్లాడ మండలం వెంగన్నపేట వద్ద మృతదేహం లభ్యమైంది. అన్నారుగూడెం గ్రామానికి చెందిన కట్కూరి జయరాజు(58)మృతిచెందాడు. జయరాజు ఈనెల నాల్గో తేదీన గోపాలపేట సమీపంలో కాళ్లు కడుక్కోనేందుకు కాల్వలోకి దిగి ప్రమాదవశాత్తూ జారిపడి కొట్టుకుపోయాడు. కుటుంబసభ్యులు మృతదేహం కోసం గాలిస్తుండగా వెంగన్నపేట వద్ద లభ్యమైంది. జయరాజు కుమారుడు కిరణ్ ఫిర్యాదు మేరకు తల్లాడ ఎస్‌హెచ్‌వో శశికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

3.21 గంటల్లో ముగిసిన పర్యటన

ఖమ్మం/భద్రాచలం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన పూర్తిగా దైవ సన్నిధికే పరిమితమైంది. జిల్లాకు వరాలు ఇస్తారని కొండంత ఆశగా ఎదురు చూసిన వారికి నిరాశే మిగిలింది. జిల్లాకు సంబంధించి సీతారామ ప్రాజెక్టు కు కావాల్సిన అదనపు నిధులు, యూనివర్సిటీ మంజూరు ప్రకటన, భద్రాద్రి ఆలయ అభివృద్ధి గోదావరి జల కాలుష్య నివారణతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించిన సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యాచరణకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

భద్రాచలంలో సీఎం పర్యటన 3.21 గంటలపాటు కొనసాగింది. ఆదివారం ఉదయం హెలీకాప్టర్‌లో బీపీఎల్ మైదానానికి చేరుకున్నారు. నిర్ణీత సమయం కంటే గంట వరకు ఆలస్యంగా వచ్చారు. దీంతో కల్యాణ తంతుకు సైతం హడావుడిగానే హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు బీపీఎల్ హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రికి ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి తుమ్మల నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, అధికారులు స్వాగతం పలికారు.

అనంతరం బీపీఎల్ విశ్రాంతి గృహానికి చేరుకొని ఉదయం 11.33 గంటలకు భద్రాచలం చేరుకొని రామాలయాన్ని దర్శించుకున్నారు. తన సతీమణి గీతతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో జరిగే సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. సతీసమేతంగా సీతారామచంద్రస్వామి వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేసి జీలకర్ర బెల్లం కార్యక్రమంతో పాటు తలంబ్రాల కార్యక్రమం వరకు కల్యాణ తంతును తిలకించారు. మండపంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆయన సతీమణి నందిని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి మాధురి కల్యాణ కార్యక్రమాన్ని తిలకించారు. కల్యాణం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఐటీసీ బీపీఎల్ విశ్రాంతి గృహానికి చేరుకొని, మధ్యాహ్నం 1.25 గంటలకు సారపాకలోని ముత్యాలమ్మపేటలో గిరిజనుడు బూరం శ్రీనివాసరావు ఇంట్లో సన్నబియ్యం భోజన కార్యక్రమానికి హాజరయ్యారు. ముఖ్యమంత్రితో మంత్రులు సన్నబియ్యంతో విందు అనంతరం హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

నారాయణపురంలో మంత్రి

పొంగులేటి పర్యటన

కల్లూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని తమ స్వగ్రామమైన నారాయణపురంలో ఆదివారం రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. భద్రాచలంలో రామనవమి కల్యాణ క్రతువులో పాల్గొని అనంతరం స్వగ్రామమైన నారాయణపురానికి వచ్చా రు. ఈ సందర్భంగా నారాయణపురంలో నూతనంగా నిర్మించనున్న గృహ నిర్మాణ పనులను మంత్రి పొం గులేటి శ్రీనువాసరెడ్డి, సతీమణి మాధురి పరిశీలించా రు. అనంతరం మంత్రి పొంగులేటి దంపతులు తన తండ్రి స్వర్గీయ రాఘవరెడ్డి సమాధి వద్దకు వెళ్లి పూ జలు చేశారు. ఈ సందర్భంగా కల్లూరు మండల పరిధిలో గల పలు గ్రా మాల కాంగ్రెస్ నాయకులు, అభిమానులు నేరుగా మంత్రి శ్రీనివాసరెడ్డిని కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ మేరకు మంత్రిని కలిసిన వారి లో కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి సత్యనారయణరెడ్డి, పెద్దబోయిన శ్రీనువాసరావు, కీసర మధుసూధన్‌రెడ్డి, ధరవత్ మెహన్ నాయక్ తదితరులు ఉన్నారు.

కనులారా వీక్షించాం..

» భద్రాద్రి రామయ్య కల్యాణం వద్ద భక్తుల మనోభావాలు

భద్రాద్రి రామయ్య కల్యాణాన్ని కనులారా వీక్షించి తరించామని పలువురు భక్తులు తమ మనోభావాన్ని తెలిపారు. రామయ్య కల్యాణాన్ని వీక్షించడానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రతి ఏటా వస్తున్నా



ఎస్.లక్ష్మణ్, రామభక్తుడు, హైదరాబాద్

నా ఇష్ట దైవం శ్రీరాముడి పెళ్లికి ప్రతి సంవత్సరం హైదరాబాద్ నుంచి వస్తున్నా. నా జీవితానికి ఇది మరువలేని రోజు. దేవుడి పెళ్లికి రావాలని నెల రోజుల ముందే ప్లాన్ చేసుకుంటా. శ్రీరామ నవమి వేడుకలు దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రిలో కమనీయంగా జరుగుతాయి. ఆ వేడుకను చూసి తరించి పోతా.

భద్రాద్రిలో పుట్టడం నా అదృష్టం



మల్లికార్జున్, భద్రాచలం

సీతారామచంద్ర ప్రభువులు కొలువై ఉన్న భద్రాద్రి పటణంలో పుట్టడం నా పూర్వ జన్మ సుకృతం. సీతారాముల ఆశీస్సులు ఈ ఉమ్మడి ఖమ్మం జిల్లాపై ఎల్లప్పుడూ ఉంటాయి. అందుకే ఈ రాష్ట్రంలో కరువు, కాటకాలు రాకుండా సుభిక్షంగా ఉంటాయి. ఆ రాముడి దయవల్ల అందరూ సుఖ సంతోషాలతో ఉండాలి.

రెండు కళ్లూ సరిపోలేదు



నాయిడు మల్లీశ్వరి, కొత్తగూడెం

సీతారాముల కళ్యాణం చూసేందుకు ఒకరోజు ముందు భద్రాచలం వచ్చాం. కళ్యాణ తంతుని దగ్గర నుంచి చూశాం. స్వామి వారిని చూస్తుంటే రెండు కళ్లూ సరిపోలేదు. భక్తుల మెచ్చే ఏర్పాట్లు అధికారులు చేశారు. ప్రతీ ఏడాది భద్రాచలం వస్తాము.

కల్యాణం చూడటం మొదటి సారి



రాజబాబు, అనకాపల్లి జిల్లా ఆంధ్రప్రదేశ్

మాది ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి, భద్రాచలంలో శ్రీరామ నవమి వేడుక లు, కల్యాణ మహోత్సవం బాగా జరుగుతుందని చాలా మంది చెప్పారు. ఈ ఏడాది చూడాలని కుటుంబ సభ్యులతో భద్రాచలం వచ్చాను. ఆలయ కమిటీ ఏర్పాట్లలో చిన్ని చిన్న సమస్యలు తప్ప తంతా బాగుంది. వచ్చే ఏడాది కూడా ఇక్కడికి వస్తాను.

ఏర్పాట్లు బాగున్నాయి



ధర్మయ్య, కొమరంబీం జిల్లా

కొడుకు, కోడళ్ల మనవడు, మనవరాళ్లతో భద్రాచలం వచ్చాం. రాత్రి సత్రంలో పడుకున్నాం. రాముల వారి దర్శనం మంచిగా జరిగింది. ఇప్పుడు కల్యాణం చూసి, పర్ణశాల వెళ్తాం. భక్తులు చాలా మంది వచ్చారు. ఏర్పాట్లు బాగున్నాయి. సీతారాముడిని చూడటం చాలా సంతోషంగా ఉంది.

ఏలూరి నుంచి నడుచుకుంటూ వచ్చాం



పెద్దింటి వీరమణి

మేము ప్రతీ ఏడాది రాముల వారి కల్యాణం చూసేందుకు వస్తాం. ఈ ఏడాది 50 మంది ఏలూరి నుంచి నడుకుంటూ భద్రాచలం వచ్చాం. ఉదయం దర్శనం చేసుకున్నాం. ఇక్కడ ఏర్పాట్లు బాలేవు. తాగునీరు లేదు. నీడ కోసం ఎలాంటి ఏర్పాట్లు లేవు. పడుకోవడానికి చాలా ఇబ్బంది అయ్యింది. పిల్లలతో చెట్ల కిందనే సేద తీరాము.

ప్రతీ ఏడాది భద్రాచలం వస్తా



లోకనాథం, విజయనగరం జిల్లా బొబ్బిలి

నేను. రాముల వారి భక్తున్ని ప్రతీ ఏడాది శ్రీరామ నవమికి భద్రాచలం వస్తాను. కల్యాణం చూడటం చాలా సంతోషంగా ఉంది. ఏర్పాట్లు ఇంకా చెయ్యాలి. భక్తులు చాలా దూరం నుంచి వస్తున్నారు. పర్ణశాల వెళ్లి దర్శనం అనంతరం విజయనగరం వెళ్లిపోతాను.

మొదటిసారి కల్యాణం చూడటం



కృష్ణ, హైదరాబాద్

సీతారాముల కల్యాణం దగ్గర నుంచి చూడటం ఇదే మొదటి సారి. చాలా ఆనందంగా ఉంది. కుటుంబ సభ్యులం పది మంది వచ్చాం. ఏర్పాట్లు ఇంకా బాగా చేయాలి. తాగునీటి సమస్య ఉంది. వచ్చే ఏడాది కూడా కుటుంబ సభ్యులం అందరం భద్రాచలం వస్తాం.

ధాన్యానికి ఇచ్చే బోనస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

» డీఎస్‌వో చందన్ కుమార్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ధాన్యానికి వచ్చే బోనస్‌ను రైతులు సద్వినియోగించుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన పాలేరు నియోజకవర్గంలో పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా కేంద్రాల వద్ద ఉన్న ఏర్పాట్లు, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి బోనస్‌ను పొందాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు రవాణా చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన ముదిగొండ మండలంలో రైసుమిల్లులను తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని తక్షణమే దించుకోవాలని, తరుగు పేరుతో పేచీలు పెట్టొద్దని ఆయన సూచించారు. డీఎస్వో వెంట డీటీ విజయ్‌బాబు తదితరులున్నారు.



కొనుగోళ్లను పరిశీలిస్తున్న డీఎస్వో

దర్గాలో శ్రీరామ నవమి వేడుకలు

ఇల్లెందులో వినూత్న సంప్రదాయం



వేడుక నిర్వహిస్తున్న ముస్లింలు

ఇల్లెందురూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవవి సాధారణంగా హిందువులు జరుపుకునే అతి పెద్ద వేడుక. కాని ఇల్లెందు మండలంలో ముస్లింలు హిందు సంప్రదాయ పద్ధతిలో శ్రీరామ నవమి వేడుకలను అంగరంగ వైభవంగా దర్గాలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇల్లెందు మండలం సత్యనారయణపురం సమీపంలోని హజరత్‌శ్రీ నాగుల్‌మీరా దర్గాలో ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. దర్గా మాలిక్ సీతారాముల కల్యాణాన్ని హిందు సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. హిందు, ముస్లిం కుటుంబాల వారు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. అదేవిధంగా సోమవారం దర్గాలో శ్రీరాముడి పట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

క్రీడా శిక్షణా శిబిరానికి దరఖాస్తుల ఆహ్వానం

చుంచుపల్లి, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేసవి క్రీడా శిక్షణ శిబిరం -2025కు ఆసక్తిగల శిక్షకులు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని డీవైఎస్‌వో పరందామరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మే ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

నేలకొండపల్లి, ఏప్రిల్6 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఆదివారం సీతారాముల కల్యాణం కన్నుల పండువగా, అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తరామదాసు జన్మించిన నేలకొండపల్లిలోని భక్తరామదాసు ధ్యాన మందిరంలో నూతనంగా నిర్మించిన ఆడిటోరియంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. భక్త రామదాసు నిర్మించిన భద్రాచలంలోని సీతారామచంద్రుల దేవాలయం నుంచి వచ్చిన వేద పండితులు మదన్‌మోహనాచార్యులు, నర్సింహాచార్యుల పర్యవేక్షణలో, అర్చకుడు సౌమిత్రి రమేష్ సహకరిస్తుండగా కల్యాణం వైభవంగా నిర్వహించారు. భద్రాచలం నుంచి ముత్యాల తలంబ్రాలు, ముత్యాలు, పట్టు వస్త్రాలు, శ్రీరాముని ప్రసాదంగా లడ్డూలు పంపారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదానాన్ని నేలకొండపల్లి ఎస్‌ఐ పెంటరి సంతోష్ ప్రారంభించారు. సింగారెడ్డిపాలెంలోని శ్రీరామ మందిరంలో శ్రీరామ కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకుడు తాటిపాముల లక్ష్మీనర్సింహం కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం పులిహోర, పానకం భక్తుల కు పంపిణీ చేసారు. పాలడుగు రవీందర్, రమ దంపతులు, అక్కినేని నాగేశ్వరరావు, చవళం ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. మండలంలోని పలు గ్రామాల్లో కల్యాణం నిర్వహించారు. నేలకొండపల్లిలోని అన్ని దేవాలయాల్లో కల్యాణం వద్ద రామ్‌కో సిమెంట్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.



భక్త రామదాసు ధ్యానమందిరంలో వేడుక..

పరవశించిన భద్రాద్రి



జీలకర్ర బెల్లాన్ని చూపిస్తున్న అర్చకులు

(5వ పేజీ తరువాయి)

వంశ గోత్రాలకు సంబంధించి ప్రవరలు ప్రవచించారు. ఇదే సమయంలో ఆశీర్వచనం, పాద ప్రక్షాళన, పుష్పోదక స్నానం జరిపి వరపూజ నిర్వహించారు. కల్యాణం సందర్భంగా సంప్రదాయబద్ధంగా భక్తరామదాసు చేయించిన నగలను వధూవరులకు ధరింపజేశారు.

తిరుమల తిరుపతి దేవస్థానం తరుపున ఛైర్మన్ బీఆర్ నాయుడు పట్టువస్త్రాలు అందజేశారు. శృంగేరి శారదా పీఠం, చినజీయర్ స్వామి తరఫున వారి ప్రతినిధులు పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తరామదాసు వారసులు కంచర్ల శ్రీనివాసరావు పట్టువస్త్రాలు స్వామి వారికి సమర్పించారు. తూము నరసింహదాసు వంశీకులు కూడా స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

భద్రాద్రి రాముని కల్యాణ వైభవ ప్రాశస్త్యంతోపాటు భక్తరామదాసు చేయించిన ఆభరణాల విశిష్టతను దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి వివరించారు. అర్చక స్వాములు మధుపర్కం ప్రాశసన అనంతరం తేనె, పెరుగు కలిపిన మిశ్రమాన్ని స్వామి వారికి నివేదించి నూతన వస్త్రాలంకరణ చేశారు. లోక పర్యంతాన్ని, విశ్వసృష్టిని దానిలో ఉన్న కాలాన్ని దేశాన్ని తెలుపుతూ సంకల్పం చెప్పి కన్యాదాన కరిష్యే అంటూ ముగించారు. ఈ సమయంలో కన్యావరణలు, కొబ్బరిబొండం, తాంబూలం, దక్షిణ స్వామి వారికి సమర్పించారు. కన్యాదానంతో పాటు గోదానం, భూదాన కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

రామ భద్రుడికి సీతామాతకు వేర్వేరుగా మంగళాష్టకం చదివారు. సరిగ్గా 12 గంటలకు అభిజిత్ లగ్నం సమీపించగానే జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని విశిష్టత వివరిస్తూ ఉత్సవమూర్తుల శిరస్సుపై ఉంచారు. అనంతరం దశరథుడు, జనకమహారాజు తరఫున, భక్తుల తరఫున భక్తరామదాసు చేయించిన మూడు మంగళసూత్రాలతో సూత్రధారణను కన్నుల పండువగా నిర్వహించారు. ఆ తరువాత తలంబ్రాల ప్రాశస్త్యం వివరిస్తూ తలంబాల కార్యక్రమం సంప్రదాయబద్ధంగా అర్చకస్వాములు నిర్వహించారు. చివరగా భాగవోత్తముల ఆశీర్వచనంతో కల్యాణం ముగిసింది.

ప్రముఖుల రాక

భద్రాద్రిలో సీతారాముల కల్యాణ వేడుకను సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు తిలకించారు. అలాగే రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబ సమేతంగా తిలకించారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, భద్రాద్రి జిల్లా పోర్టు ఫోలియో జడ్జి సూర్యపల్లి నందా, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి బి.కృష్ణమోహన్, జిల్లా న్యాయాధికారి వసంత్‌పాటిల్, ఖమ్మం జిల్లా న్యాయాధికారి పి.రాజగోపాల్, ఎండోమెంట్ ట్రిబ్యునల్ న్యాయాధికారి ఎం.వెంకటేశ్వరరావు, హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు న్యాయాధికారి వి.భవాని, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి జి.భానుమతి, సీనియర్ సివిల్ జడ్జి బి.రామారావు, భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి శివనాయక్ తదితరులు కల్యాణ వేడుకకు హాజరయ్యారు.

వీరితో పాటు ఎంపీలు పోరిక బలరాంనాయక్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పొదెం వీరయ్య, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, రాందాస్‌నాయక్, కోరం కనకయ్య, మట్టా రాగమయి, కూనంనేని సాంబశివరావులు సైతం కల్యాణాన్ని తిలకించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రెవెన్యూ దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, అదనపు కమిషనర్ కృష్ణవేణి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా, ఇంటెలిజెన్స్ ఎస్పీ శ్రీధర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఆర్డీవో దామోదర్‌రావు తదితరులు ఈ వేడుకలో పాల్గన్నారు.

తొలిసారి తలంబ్రాలు సమర్పించిన సీఎం దంపతులు

సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున తొలిసారిగా సీతారాములకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. హెలీకాప్టర్‌లో సతీమణి గీతతో కలిసి వచ్చిన ముఖ్యమంత్రి.. ఉదయం 11.33 నిమిషాలకు రామాలయం చేరుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడనోళ్ల గోత్రం పేరిట వైదిక సిబ్బంది మూలవరుల వద్ద ప్రత్యేక అర్చన నిర్వహించారు. అనంతరం సీఎం దంపతులకు భద్రాద్రి దేవస్థానం తరఫున జ్ఞాపిక, ప్రసాదం, శాలువాలను అందజేశారు. పూజల అనంతరం 11.45కు బయలుదేరి మిథిల స్టేడియం చేరుకున్నారు. అక్కడ జీలకర్ర బెల్లం సమయంలో పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. అనంతరం కల్యాణతంతును వీక్షించారు. సీఎం దంపతులను కల్యాణ మండపంలో వైదిక సిబ్బంది ఆశీర్వదించి తలంబ్రాలను అందజేశారు.

పులకించిన భక్త జనకోటి

శ్రీరామనవమిని పురస్కరించుకొని భద్రాద్రిలో శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణాన్ని తిలకించడానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో భద్రాద్రి భక్తజనంతో పులకించింది. రెండు రాష్ట్రాల్లో పది, ఇంటర్ పరీక్షలు ముగియడంతో భక్తులు అధికంగా తరలివచ్చారు. అయితే వసతి, సౌకర్యాలు లేక సామాన్య భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక వైపు ఎండ వేడిమి తాళలేక, మరో వైపు కనీస వసతులు కరువై ఇక్కట్ల పాలయ్యారు. హోటళ్లతో పాటు శీతల పానీయ కేంద్రాల్లో రద్దీ ఏర్పడింది. బస్సులు దొరకక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సత్రాలు లేక భక్తులు కరకట్టపైనే నిద్రించారు.

సామాన్యుడి ఇంట అసామాన్యుడు

భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని ముత్యాలమ్మపేటలో నాయకపోడు గిరిజనుడు బూరం శ్రీనివాసరావు ఇంట్లో సీఎం రేవంత్‌రెడ్డి సందడి చేశారు. వారి ఇంట్లో సన్నబియ్యం భోజనం చేశారు. దీంతో ఆ గిరిజన దంపతులు ఆనంద పారవశ్యానికి లోనయ్యారు. ఇంతటి అదృష్టాన్ని తీసుకొచ్చిన శ్రీరామ నవమిని ఎన్నటికి మరిచిపోమన్నారు.



కాళ్లు కడుక్కుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



భోజనం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



గిరిజన దంపతులకు నూతన వస్త్రాలు పెడుతున్న సీఎం

శ్రీరామపునర్వసు దీక్షలు ప్రారంభం



భద్రాచలం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామ పునర్వసు దీక్షలో భాగంగా భక్తులు ఆదివారం శ్రీరామ పునర్వసు దీక్షను స్వీకరించారు. ప్రతి ఏటా శ్రీరామనవమి రోజున పునర్వసు దీక్షను స్వీకరించడం సంప్రదాయంగా వస్తోంది. 27 రోజుల అనంతరం మే 3న ఈ దీక్ష విరమణ ఉండనుండగా 4న పట్టాభిషేకం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో 27 రోజుల అనంతరం శ్రీరామ పునర్వసు దీక్ష విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో స్థానిక రామాలయ ప్రాంగణంలో అర్చకుల సమక్షంలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి శ్రీరామ పునర్వసు దీక్షను స్వీకరించారు. ఇదిలా ఉండగా భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణం ఆదివారం నిర్వహించగా రాత్రి కల్యాణ రామునికి చంద్రప్రభ వాహనంపై తిరువీధి సేవ నిర్వహించారు. సీతారామచంద్ర స్వామిని అందంగా అలంకరించిన చంద్రప్రభ వాహనంలో ఊరేగించారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

బాగా చదువుకుంటున్నారా: భట్టి



విద్యార్థినులతో మాట్లాడుతున్న భట్టి

వైరా, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఎలా ఉన్నారు... బాగా చదువుకుంటున్నారా... పెద్దయ్యాక ఏమవుదామనుకుంటున్నారు... మీకు భోజనం బాగుంటుందా... భోజనం చేద్దామా... మెనూ ప్లెక్సీ ఎక్కడ పెట్టారంటూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వైరాలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులకు ప్రశ్నలు సంధించారు. స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి ఆదివారం రాత్రి భట్టి విక్రమార్క వైరాలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో ప్రత్యేకంగా సమావేశమైన భట్టి ఆ తర్వాత వారితో కలిసి భోజనం చేశారు. ఆదివారం భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి కల్యాణానికి హాజరై తిరుగు ప్రయాణంలో తన సతీమణి నందినితో కలిసి స్వయంగా కారు నడుపుకుంటూ తమ స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురం చేరుకున్నారు. అక్కడ జరుగుతున్న ఆలయ ఇతర అభివృద్ధి పనులను పరిశీలించారు. తిరిగి అక్కడి నుంచి వైరా చేరుకొని మొదట వందపడకల ఆసుపత్రి నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. వచ్చిన వెంటనే విద్యార్థినులతో సమావేశమై వారితో మాట్లాడారు. అనంతరం డైనింగ్ హాల్‌కు వెళ్లి విద్యార్థినులతో కలిసి డిన్నర్ చేశారు.

కల్యాణ వేడుకలో ప్రముఖులు


ఎంపీ వద్దిరాజు రవిచంద్ర


ఐజీ సౌమ్య మిశ్రా


కలెక్టర్ జితేష్ వి. పాటిల్


టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు


ప్రత్యేక అధికారి కృష్ణవేణి


దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్

కల్యాణం తిలకించడంతో అశ్వమేధ యాగఫలం

▸ స్థానాచార్యుడు కేఈ స్థలశాయి



భద్రాచలం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రంలో చైత్రశుద్ధ నవమి నాడు శ్రీ సీతారాముల కల్యాణం తిలకించడం వలన అశ్వమేధ యాగఫలం సిద్ధిస్తుందని భద్రాద్రి దేవస్థానం స్థానాచార్యుడు కేఈ స్థలశాయి అన్నారు. ఆదివారం శ్రీరామనవమిని పురస్కరించుకొని కల్యాణం జరిగే తీరును ఆయన, దేవస్థానం రామాయణపారాయణదారుడు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు వివరించారు. ఆదివారం పునర్వసు నక్షత్రం శ్రీరామనవమి మూడు కలిసి రావడం ఎంతో ప్రత్యేకత సంతరించుకుందన్నారు. రాముడికి ప్రియమైన వారం ఆదివారమని అటువంటి మూడు విశేషాలు కలిగి ఉన్న ఈ రోజు కల్యాణం చేయించుకోవడం లేదా తిలకించడం వలన విశేష ఫలితం లభిస్తుందన్నారు. మహాసంకల్పం ప్రాశస్త్యాన్ని ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు వివరించారు. మహా సంకల్పంలో భూమి ఔన్నత్యాన్ని, భూమిపై ఉన్న ద్వీపాలు, నదులు, భారతదేశంపై ప్రవహించే నదుల ప్రాశస్త్యం, కన్యాదానం చేయడం వలన వచ్చే ఫలితాన్ని మహా సంకల్పంలో వివరించారన్నారు.

భక్తాద్రి..



భద్రాచలం/చర్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ వేడుకను కనులార తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తజనం భద్రాద్రి చేరడంతో భద్రగిరి భక్తజనంతో పులకరించింది. అంతా రామమయం అన్నట్లుగా భద్రాచలం వీధులు భక్తజన సందడితో జై శ్రీరామ్ అంటూ భక్తుల కోలాహలం కనిపించింది. పదో తరగతి ఇంటర్ పరీక్షలు పూర్తికావడంతో కుటుంబ సభ్యులు వృద్ధులు పిల్ల పపాపలతో కలిసి బస్సులు కార్లు, వ్యాన్లు ఆటోలు, రైళ్ల ద్వారా భక్తులు భద్రాద్రికి శనివారం రాత్రికే చేరుకున్నారు. ఎదుర్కోలు ఉత్సవం నుంచి కల్యాణ మహోత్సవం వరకు భక్తులు జైశ్రీరామ్ అంటూ ఆలయ ప్రాంగణంలో రాముని దర్శనం కోసం బారులు తీరారు. ఏపీ నుంచి కూడా ఈసారి

తరలివచ్చిన భక్త బృందం ● అంతా రామమయం


సీతారాముల కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

అధికంగా భక్తులు రావడం చెప్పుకోదగ్గ విషయం. గోదావరి నదిలో ఉదయం పుణ్య స్నానాలు చేసిన భక్తులు తలనీలాలు సమర్పించుకొని కల్యాణం జరిగే మిథిలా స్టేడియానికి ఉదయంకే చేరుకున్నారు. కల్యాణ మండపం చుట్టూ వేలాదిగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రామాలయం నుంచి 9.15కి స్వామి వారు బయలేదరి 9.45 గంటలకు మండప ఆవరణలోకి వచ్చిన శ్రీ సీతారామచంద్రస్వామి వారు 10 గంటలకు కల్యాణ తంతుకు సిద్ధమయ్యారు. వేద పండితులు కల్యాణ తంతును ప్రారంభించి భక్తుల సమక్షంలో కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీసమేతంగా భద్రాచలం చేరుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు కూడా రామాలయ దర్శనం, కల్యాణ వేడుక కార్యక్రమానికి హాజరయ్యారు. పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, హైకోర్టు న్యాయమూర్తులతో పాటు వేలాదిగా వచ్చిన భక్తులతో కల్యాణ మండపం కిటకిటలాడింది.

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిసా ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. జైశ్రీరాం అంటూ భక్తులు స్వామి వారిని స్మరించుకున్నారు. భద్రాచలంలో స్వామి వారి దర్శనం అనంతరం భక్తులు పర్ణశాలకు బయలు దేరారు. ఇదే క్రమంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది. అధికారులు రోడ్ క్లియర్ చేశారు. భద్రాచలం వచ్చిన భక్తుల కోసం పలు వీధుల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దాహం తీర్చేందుకు పలువురు మజ్జిక ప్యాకెట్లు ఉచితంగా అందజేశారు. మరి కొంత మంది పానకం నీటిని కూడా భక్తులకు పిలిచి మరీ అందించారు.

గోదావరితీరంలోని స్నాన గట్టాల వద్ద భక్తుల సందడిగా కనిపించింది. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

కల్యాణం ఘనంగా జరిగింది

▸ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ


ధ్వజస్తంభం వద్ద నమస్కరిస్తున్న మంత్రి సురేఖ

భద్రాచలం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించినట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. భద్రాచలంలో సీతారాముల కల్యాణం తిలకించేందుకు ఆదివారం వచ్చిన మంత్రి సురేఖ తొలుత రామాలయంలో మూలవరుల దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె కొద్దిసేపు విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఉండగా భద్రాద్రిలో రామయ్య కల్యాణం అంగరంగ వైభవంగా జరిగేదన్నారు. అదే రీతిలో తమ ప్రభుత్వ హయాంలోనూ స్వామి వారి కల్యాణం నిర్వహించామన్నారు. యాదగిరి గుట్ట తరహాలో భద్రాద్రి రామాలయ అభివృద్ధి పనులను చేపట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పించారని, తప్పకుండా భక్తుల మనోభావాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

పట్టువస్త్రాలు తెచ్చిన ప్రముఖులు

భద్రాచలం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సీతారామచంద్రస్వామి వారి లగ్నాన్ని పురస్కరించుకొని భద్రాచలంలో నూతన వధూవరులైన శ్రీ సీతారామచంద్రస్వామి వారికి పలువురు ప్రముఖులు పట్టు వస్త్రాలు సమర్పించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దంపతులతో పాటు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తిరుపతి దేవస్థానం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి, హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్, హరినాథ్‌తో పాటు పలువురు న్యాయమూర్తులు, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు పట్టు వస్త్రాలు సమర్పించారు.

భక్తుల సేవలో స్వచ్ఛంద సంస్థలు



మజ్జిగ పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సేవకులు

భద్రాచలం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార నిర్వాహకులు, వివిధ కార్పొరేట్ సంస్థలు భక్తులకు విశేష సేవలందించాయి. పట్టణమంతా మజ్జిగ, తాగునీరు, బెల్లం పానకం, పాలు పంపిణీ విస్తృతంగా పంపిణీ చేశారు. యూబీ రోడ్డు, సూపర్‌బజారు సెంటర్, రాజుల సత్రం, మాజీ సైనిక ఉద్యోగుల సంఘం, కల్కి సేవా సమితి, మార్కెట్ వర్తక సంఘం, అంబేద్కర్ సెంటర్‌తో పాటు పలు చోట్ల భక్తులకు అన్నదానం చేశారు. దీంతో వేలాది మంది భక్తులు అన్నదాన కేంద్రాల వద్ద బారులు తీరారు. ప్రభుత్వం భక్తులకు ప్రభుత్వం తరపున అరకొర ఏర్పాట్లు చేసినా స్వచ్ఛంద సంస్థలు మాత్రం భక్తులకు విశేష సేవలందించి వారి ప్రశంసలు పొందాయి. భద్రాచలంలోని కొర్రాజులగుట్ట బాల్యమిత్ర బృందం ఆధ్వర్యంలో ఎనిమిది వేల మందికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం


సీఎంకు స్వాగతం పలుకుతున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రులు

బూర్గంపాడు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భద్రాచలంలో జరిగే శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణంలో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక బీపీఎల్ స్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు హెలికాప్టర్ ద్వారా చేరుకున్నారు. షెడ్యూల్ సమయానికి కంటే గంట ఆలస్యంగా సీఎం హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. సీఎంకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు ఘన స్వాగతం పలికారు. అక్కడి రోడ్డు మార్గాన ఐటీసీ గెస్ట్‌హౌజ్‌కు చేరుకున్న సీఎంకు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. కొంత సమయం తర్వాత ఐటీసీ గెస్ట్ హౌజ్ నుంచి రోడ్డు మార్గాన భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి చేరుకున్నారు. కల్యాణం అనంతరం బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక ముత్యాలమ్మపేటలోని సన్నబియ్యం లబ్ధిదారుడు బూరం శ్రీనివాసరావు ఇంటికి చేరుకున్నారు. లబ్ధిదారుడు కుటుంబసభ్యులతో కలిసి డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావులతో కలిసి సన్నబియ్యంతో చేసిన భోజనాన్ని ఆరగించారు. అనంతరం హెలిప్యాడ్ వద్ద చేరుకున్న సీఎంకు మంత్రులు, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ వీడ్కోలు పలకడంతో హెలికాప్టర్ ద్వారా హైదారాబాదు బయలు దేరివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రోహిత్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలంలో భక్తుల సందడి


అభిమానులకు అభివాదం చేస్తున్న సీఎం


సీతారాముల పరిణయ దృశ్యం


స్వామివారి తిరువీధి సేవ


అధికారులతో మంత్రి తుమ్మల


సీఎస్ శాంతికుమారికి ప్రసాదాలు అందజేస్తున్న ఈవో రమాదేవి


దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్

భద్రాద్రిలో భారీగా ట్రాఫిక్‌జామ్


బస్టాండ్ సమీపంలో నిలిచిన వాహనాలు

భద్రాచలం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణానికి భారీగా భక్తులు రావడంతో కార్లు, జీపులు, వ్యాన్లు, బస్సులతో భారీగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రావడంతో ఈసారి ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఉదయానికే వాహనాలు రోడ్లపైన పార్కింగ్ చేశారు. ఉదయభాస్కర్ రోడ్డుతో పాటు పట్టణంలోని పలు రహదారుల్లో కార్లు, జీపులు, వ్యాన్లు రోడ్లపై నిలిపివేసి భక్తులు నడిచి కల్యాణ మండపానికి చేరుకున్నారు. సీఎం కాన్వాయ్ రావడంతో కొద్దిసేపు వాహనాలు కూడా పోలీసులు నిలిపివేయడంతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. మళ్లీ సీఎం కాన్వాయ్ వెళ్లే సమయంలో రాకపోకలు బ్రిడ్జిపై నియంత్రించడంతో మళ్లీ మండే ఎండలో సైతం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో వాహనాల ట్రాఫిక్ సమస్యతో పోలీసులు సైతం ట్రాఫిక్ పునరుద్ధరణకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది.

రామ బంధువు.. మండపేట రామారెడ్డి

▸ 25ఏళ్లుగా నారికేళాలు అందజేస్తున్న భక్తుడు

భద్రాచలం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణానికి మండపేట నుంచి శ్రీరాముడు, సీత, శంకు చక్రాలతో నారికేళాలను కేవీ రామారెడ్డి అనే భక్తుడు తన కుటుంబంతో తీసుకొస్తున్నారు. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా మండపేటకు చెందిన రామారెడ్డి రామయ్యపై ఉన్న భక్తితో పెద్ద నారికేళాలను గుర్తించి వాటిపై శంకు చక్రాలను చెక్కించి ఏటా స్వామి వారి కల్యాణం రోజున మిథిల స్టేడియంలోని శిల్పకళాశోభితమైన కల్యాణ మండపంలో వాటిని సమర్పిస్తున్నారు. ఈ విధంగా గత 24 ఏళ్లుగా ఆయన వాటిని సమర్పించారు. ఈ సారి ఆదివారం కల్యాణంలో 25వ సారి అందజేశారు. వీటిని ఏటా దేవస్థానం వైదిక సిబ్బంది కల్యాణ సమయంలో ప్రత్యేకంగా వినియోగిస్తున్నారు.


నారికేళాలతో రామారెడ్డి కుటుంబం

ఆ భాగ్యం రామయ్యకే..

▸ నేడు శ్రీరామ మహా పట్టాభిషేకం

▸ పట్టు వస్త్రాలు సమర్పించనున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


కల్యాణ రాముడు

భద్రాచలం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కల్యాణం అనంతరం ఒక్క శ్రీ సీతారామచంద్రమూర్తులకు తప్ప మరే ఇతర దైవానికి నిర్వహించని విలక్షణమైన ఉత్సవం శ్రీరామ మహా పట్టాభిషేకం. ఇది భద్రాచల రామయ్యకు మాత్రమే దక్కుతుంది. ఈ పట్టాభిషేకాన్ని నిత్యం జరిగే శ్రీరామ పారాయణంకు అనుగుణంగా ప్రతి నెల పుష్యమి నాడు జరిగే క్రతువును శ్రీరామ పట్టాభిషేకంగాను, ఏటా శ్రీ సీతారాముల కల్యాణం అనంతరం మరునాడు జరిగే క్రతువును శ్రీరామ మహా పట్టాభిషేకంగా పేర్కొంటారు. కాగా ప్రతి పుష్కరానికి (12 సంవత్సరాలు) జరిగే ఈ ఉత్సవాన్ని సామ్రాజ్య పట్టాభిషేకంగా, ప్రతి ప్రభవ నామ సంవత్సరంలో 60 సంవత్సరాలకు ఒక సారి జరిగే ఉత్సవాన్ని శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవంగాను నిర్వహించటం ఈ క్షేత్ర సంప్రదాయం. ఇందులో భాగంగా 1927, 1987లో మహా సామ్రాజ్య పట్టాభిషేకాలు నిర్వహించారు. ఈ సమయంలో భక్తుల సౌకర్యార్థం ఇందులో మార్పులు చేస్తూ పుష్కరంలో పట్టాభిషేకం నిర్వహించాలని నిర్ణయించి 1999లో తొలిసారి పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం జరిపారు. రెండోసారి 2011లో పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకాన్ని నిర్వహించారు. 2023లో శ్రీరామ పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం జరిపారు. శ్రీరామ మహా పట్టాభిషేకంలో ఈ సందర్భంగా రామునికి సంబంధించిన ఆభరణాలతో పాటు రాజ దండం, రాజముద్రిక, చత్రం, శంఖు, చక్రాలు, కిరీటం ధరింపజేస్తారు. ఈ పట్టాభిషేకానికి భద్రాచలం దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. కల్యాణ మండపంలో విస్తృత బందోబస్తు సిద్ధం చేశారు.

హెలికాప్టర్‌లో రానున్న గవర్నర్..

శ్రీరామ మహా పట్టాభిషేకంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించనున్న నాల్గో గవర్నరుగా జిష్ణుదేవ్ వర్మ నిలవనున్నారు. ఇందుకోసం ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆయన సోమవారం భద్రాచలం రానున్నారు. హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి 9.45 గంటలకు బయలుదేరి 10.45కి భద్రాచలం హెలిప్యాడ్‌కు చేరుకోనున్నారు. 10.50కి సారపాకలోని ఐటీసీ అతిథి గృహానికి రోడ్డు మార్గంలో చేరుకుంటారు. 11.20కి ఐటీసీ అతిథిగృహం నుంచి బయలుదేరి 11.30కి భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆలయంకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 11.45 నుంచి 12.45 వరకు మిథిల స్టేడియంలోని శిల్పకళా శోభితమైన కల్యాణ మండపంలో నిర్వహించే శ్రీరామ మహాపట్టాభిషేకంలో పాల్గొననున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే మహా పట్టాభిషేకంలో పాల్గొనే సంప్రదాయానికి గవర్నర్ నరసింహన్ శ్రీకారం చుట్టారు. అత్యధిక సార్లు పట్టాభిషేకంలో పాల్గొన్న ఘనత సైతం ఆయనదే. నరసింహన్ తరువాత అప్పటి గవర్నర్ తమిళిసై ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు సమర్పించారు. గత ఏడాది రామయ్య పట్టాభిషేకంలో పట్టు వస్త్రాలు గవర్నర్ రాధాకృష్ణన్ సమర్పించారు. తాజాగా జిష్ణుదేవ్‌వర్మ సోమవారం పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

సైడ్ లైట్స్..

భద్రాచలం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఆదివారం శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కల్యాణంను పురస్కరించుకొని జరిగిన ముఖ్యమైన సైడ్‌లైట్స్ ఇవే ..

- సీఎం సుమారు గంట ఆలస్యంగా భద్రాచలం చేరుకున్నారు.
- సీఎం రాక నేపథ్యంలో గంటపాటు భద్రాద్రి రామాలయంలో దర్శనాలను నిలిపివేయడంతో భక్తులు లేక ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లు ఖాళీగా దర్శనమిచ్చాయి.
- శ్రీరామనవమికి అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావడంతో దొంగలు తమ చేతివాటం ప్రదర్శించడంతో పలువురు భక్తుల ఫోన్లు, పర్సులు చోరీకి గురయ్యాయి.
- ఎండ వేడిమితో పాటు కల్యాణ సెక్టార్లో ఉక్కపోత వలన పలువురు వృద్ధులు, మహిళలు అస్వస్థతకు గురయ్యారు. వారిని 108 వాహనంలో తరలించి ప్రథమ చికిత్స చేసి పంపారు. స్వామి వారిని తీసుకెళ్తున్న సమయంలో భక్తుడి తలకు గాయం కావడంతో రక్తం రావడంతో ప్రథమ చికిత్స నిర్వహించి తలకు కట్టుకట్టి వైద్యశాలకు పంపారు.
- సీఎం ఏజెన్సీకి వరాలు ఇస్తారని భావించగా ఆయన కేవలం ఆధ్యాత్మిక పర్యటనకే పరిమితం కావడంతో ఏజెన్సీవాసులు నిరాశ చెందారు.
- బూర్గంపాడు మండలం సారపాకలో బూరం శ్రీనివాసు ఇంట్లో సీఎం సన్నబియ్యంతో భోజనం చేశారు. ఇదే సమయంలో సీఎంను చూసేందుకు వచ్చిన ప్రజలకు అభివాదం చేశారు.



ముస్లిం యువకుల మజ్జిగ పంపిణీ



ఖమ్మం ఖానాపురంహవేలి: నగరంలోని 42వ డివిజన్‌లో సీతారాములు కల్యాణానికి విచ్చేసిన భక్తులకు ముస్లిం యువకులు మజ్జిగ పంపిణీ చేశారు. సుమారు 3వేలమందికి మజ్జిగ అంద జేశారు. 24వ డివిజన్‌లో కల్యాణంలో కార్పొరేటర్ కమర్తపు మురళి దంపతులు పాల్గొన్నారు. దాసాంజనేయ స్వామి ఆలయంలో 108 జంటలు కల్యాణంలో పాల్గొన్నారు.



ఖానాపురం అభయ వెంకటేశ్వరస్వామి ఆలయంలో..



గాంధీచౌక్‌లో



ఖమ్మం పర్ణశాలలో తుమ్మల యుగంధర్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు



హాజరైన భక్తులు

కల్యాణం.. కమనీయం

వాడవాడలా సీతారాముల కల్యాణం

పర్ణశాల, గాంధీచౌక్‌లో భారీగా హాజరైన భక్తులు



చింతగుర్తి రామాలయంలో..



సూర్యానగర్‌లో కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు



తిరుమలాయపాలెంలో..

ఖమ్మంఖానాపురంహవేలి,ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకలను ఆదివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అభిజిత్ లఘ్నం ఉదయం 11:50 నిమిషాలకు సీతమ్మ, రామయ్య శిరస్సులపై అర్చక స్వాములు జీలకర బెల్లం పెట్టారు. అశేష భక్తజన సందోహం నడుమ వేద మంత్రాలు, మంగళవాయిద్యాలతో పండితులు సీతారాముల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు.ఉదయం సూర్యుడు ప్రతాపం అధికంగా ఉండటతో చైర్మన్ చావా. నారాయణరావు, ఆలయ కార్య నిర్వాహణ అధికారి వనం. వేంకటనరసింహారావు ఆధ్వర్యంలో పర్ణశాల రామాలయంలో వాటర్ స్ప్రేలను, కూలర్లను అందుబాటులో ఉంచారు. ఆలయం వద్ద జనవిజ్ఞాన వేదిక ఆదర్యంలో భక్తులకు మజ్జిగ అందించారు. స్వామివారికి పట్టు వస్త్రాలను స్థానిక కార్పోరేటర్ చావా. మాధురినారాయణరావు దంపతులు, మిట్టపల్లి మోహన్‌రావు దంపతులు అందించారు. భక్తులు సౌకర్యార్థం ఎల్ఈడీ స్ర్కీన్‌లను ఏర్పాట్లు చేశారు. సాయంత్రం స్వామి వారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. నగరంలోని గాంధీచౌక్‌లో శ్రీసీతారామచంద్రస్వామి 78వ వార్షిక కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఎల్ఈడి స్ర్కీలను ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. నగరంలోని పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

టీఎన్జీవోస్ ఫంక్షన్‌హాల్లో

ఖమ్మంకలెక్టరేట్: నగరం వీడీవోసకాలనీ టీఎన్జీవో ఫంక్షన్‌హాల్‌లో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుంటుపల్లి శ్రీనివాసరావు, చెరుకూరి రమేష్‌ఏపూరి



సీతారాములను తీసుకొస్తున్న అర్చక స్వాములు



అన్నదానం ప్రారంభిస్తున్న ఎస్ఐ సంతోష్



ఖానాపురం కందిరాజునగర్‌లో..

మధుసూదన్‌రావు, కామ్రేడ్ వెంకటేశ్వర్లు, భవనాశి కేశవరావు పాపారావు భాస్కర్‌రావు, సాయిపాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: సుబ్లేడు రామాలయంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి దంపతులు పూజలు చేశారు. కొక్కిరేణి రామాలయంలో ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ దంపతులు, డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు వేడకల్లో పాల్గొన్నారు. పలు ఆలయాల్లో అన్నదానం చేశారు.

వాడవాడలా రామయ్య కల్యాణం

కూసుమంచి: కూసుమంచి మండలం జీళ్లచెరువులోని ప్రసిద్ధ రామాలయంలో శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణక్రతువును జరిగించారు. ఐదు దశాబ్దాలుగా భద్రాచలంలో జరిగే కల్యాణక్రతువు సమయానికే ఇక్కడ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఆలయ కార్యనిర్వహణాధికారి నారాయణాచార్యులు గ్రామపెద్దలు పాల్గొన్నారు. కూసుమంచిలోని రామాలయంలో జరిగిన వేడుకల్లో కందుల వెంకన్న దంపతులు పీటలపై కూర్చొని సీతారామ కల్యాణాన్ని జరిపించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించి పునీతులయ్యారు. కల్యాణం అనంతరం భక్తులకు పులిహోర, అన్నదానం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మండలంలో ఇంకా గట్టుసింగారం, నర్సింహులగూడెం, పెరికశింగారం, లోక్యాతండ, జగ్మాల్‌తండ, జక్కేపల్లి, తుర్కగూడెం, కేశ్వాపురం, గోపాలరావుపేట తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ నిర్వహకులు అన్నదానం చేశారు.



స్వామివారి తలంబ్రాలు కలుపుతున్న భక్తులు



జీళ్లచెరువులో ఎదుర్కోలు ఉత్సవం



కల్యాణంలో పాల్గొన్న 108 జంటలు



26వ డివిజన్‌లో పూజలు చేస్తున్న మేయర్ దంపతులు



సింగారెడ్డిపాలెం శ్రీరామమందిరంలో..



టీఎన్జీవో కార్యాలయంలో..



50వ డివిజన్‌లో పూజలో పాల్గొన్న తుమ్మల యుగంధర్, కార్పొరేటర్ శరత్

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు

ఖమ్మంబైపాస్‌రోడ్, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): బీజేపీ పార్టీ ఆవిర్భావం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వేడుకలు నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాయకులకు,కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు. బీజేపీ దేశభక్తి, సేవాతత్పరతపై నిలిచినపార్టీఅని చెప్పారు. జిల్లాలో పార్టీ ఉన్నతస్థాయిలో ఉండేందుకు కార్యకర్తలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రప్రదీప్, మంద సరస్వతి,శ్యామ్‌రాథోడ్, అల్లిక అంజయ్య, వెంకటనారాయణ పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. మండలంలోని కాకరవాయి, బీరోలు, రఘునాథపాలెం, తిరుమలాయపాలెం తదితర గ్రామాలలో వేడుకకలునిర్వహించారు.రఘునాథపాలెంలో ఆపార్టీ జెండాను రాష్ట్ర కార్యవర్గసభ్యుడు టి.నరేందర్‌రావు, తిరుమలాయపాలెంలో మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి ప్రసాద్ ఆవిష్కరించారు.ఈకార్యక్రమంలో నాయకులు నల్లగట్టు శ్రీను, పాల్గొన్నారు.

సన్నాల కొనుగోలులో నిబంధనలు పాటించాలి

జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్

కూసుమంచి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సన్నవడ్ల కొనుగోలులో నిర్వహకులు నిబంధనలు పాటించాలని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ తెలిపారు. ఆదివారం కూసుమంచి మండలం పాలేరులో ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రానికి వచ్చే ధాన్యం నాణ్యతను నిరంతరం పరిశీలించాలన్నారు. తేమశాతం రాగానే వెంటనే కొనుగోలు చేసి సెంటర్‌కు కేటాయించిన రైస్ మిల్లుకు తరలించాలన్నారు. సన్నధాన్యం కొనుగోలులో నిబంధనలు తూచతప్పకుండా పాటించాలన్నారు. జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. రైతుల వివరాలను వెంటనే ట్యాబ్ ద్వారా ఎంట్రీ పూర్తిచేయాలన్నారు. రైస్ మిల్లుల వద్ద ఎటువంటి కోతలు లేకుండా చూడాలని లేని పక్షంలో మిల్లర్లపై చర్యలు తప్పవని చందన్‌కుమార్ హెచ్చరించారు.

స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ వార్షికోత్సవం

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీనగర్‌కాలనీలోని స్టెమ్ స్పార్క్ రెజోనెన్స్ పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయాధికారి జి రాజ్‌గోపాల్ హాజరయ్యారు. పాఠశాల డైరెక్టర్లు కొండ శ్రీధర్‌రావు, కృష్ణవేణితో కలిసి జ్యోతిప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి రాజ్‌గోపాల్ మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో విలువైనదని, ఈ దశలోనే గొప్ప లక్ష్యాలను ఎంచుకొని దానికి అనుగుణంగా నిరంతర ప్రణాళికతో విజయాలను సాధించాలని అన్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్లు మాట్లాడుతూ నిరంతర ప్రణాళికతో తిరుగులేని విజేతలుగా నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. వివిధ పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు రాజ్‌గోపాల్ చేత బహుమతులు అందించారు.



విద్యార్థికి బహుమతి అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజ్‌గోపాల్

మహిళా రోగిపై.. వైద్యుడి నోటిదురుసు

ఖమ్మంకలెక్టరేట్,ఏప్రిల్6 (ఆంధ్రజ్యోతి): మహిళరోగిపట్ల ఆస్పత్రి వైద్యుడు, సిబ్బంది నోటిదురుసుగా, అమర్యాదగా ప్రవర్తించినట్లు ఆమె బంధువులు ఆరోపిస్తున్నారు. వైరాకు చెందిన మహిళ కిందపడగా చేయి విరిగింది. దీంతో ఖమ్మంలో ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా, ఆపరేషన్ చేశారు. ఈ సమయంలో థియేటర్‌లో సదరు మహిళను థియేటర్ సహాయకులు, వైద్యుడు అమర్యాదగా మాట్లాడికించ పరిచారని ఆమె తీవ్ర మనస్థాపం చెందింది. ఈ నేపథ్యంలోనే వారితీరుతో తక్షణమే డిశ్చార్జి చేయించుకుని ఇంటికి వెళ్లిపోయింది. ఈ విషయమై వైద్య ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆమె బంధువులు చెప్పారు.

మాస్‌లైన్ నాయకుల నిర్బంధం హేయం

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్6 (ఆంధ్రజ్యోతి) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాచలం పర్యటన సందర్భంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మాస్‌లైన్ నాయకులను ముందస్తు అరెస్టులు చేయటం సరికాదని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కమిటీ కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు ఖండించారు. ఖమ్మంలో ఆవుల అశోక్, కే శ్రీనివాస్, ఆజాద్, మణుగూరులో ఆర్ మధుసూదన్‌రెడ్డిను అరెస్ట్ చేయటంపై తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే

- కనీస జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దూరం
- మానసిక ఒత్తిడి, పనిభారంతో బీపీ, షుగర్

నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం





ఖమ్మంకలెక్టరేట్, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): ఎంత సంపద ఉన్నా.. మనిషి ఆరోగ్యంగా లేకుంటే జీవితం ఆనందంగా ఉండదనేది ఈ మధ్య కాలంలో చాలా మందికి తెలిసొచ్చింది. అందుకే పెద్దలు ఆరోగ్యమే.. మహాభాగ్యం అన్నారు. ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకునే ఆహారం.. తాగే నీరు, పీల్చేగాలి, పర్యావరణం, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని వైద్యులు అంటున్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఆరోగ్య పరిస్థితులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

ఏప్రిల్ 7 ఎందుకు నిర్వహిస్తున్నారంటే?

1948లో ప్రపంచ ఆరోగ్యసంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఏటా ఒక అంశాన్ని ఎందుకొని ప్రజలను చైతన్యం చేసేలా కార్యక్రమాలను చేపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 13మిలియన్లకు పైగా మరణాలు పర్యావరణ కారణాలతో సంభవిస్తున్నాయని ప్రపంచ ఆరోగ్యసంస్థ అంచనాలు వేసింది. ఈ నేపథ్యంలో 2025లో తల్లిబిడ్డల ఆరోగ్యం (హెల్తీ బిగినింగ్స్-హోప్‌ఫుల్ ప్యూచర్) ముందే మేల్కొని బిడ్డల ఆరోగ్యం కాపాడితే భవిష్యత్తు ఆరోగ్యంగా ఉంటుందని ట్యాగ్‌లైన్‌తో చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

ప్రైవేటు ఆసుపత్రుల్లో అధిక ప్రసవాలు

జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రుల్లో 55శాతం ప్రసవాలు జరుగుతుంటే ప్రభుత్వ దవాఖానాల్లో 50శాతం ప్రసవాలు జరుగుతున్నట్లు వైద్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. ప్రసవానికి వెళ్లే వారికి ప్రైవేటులో 80నుంచి 90శాతం సిజేరియన్ ఆపరేషన్లు చేస్తున్నారు. ఇదే ప్రభుత్వ ఆస్పత్రుల్లో 30శాతం ఉంది. పిల్లల్లో ముఖ్యంగా రక్తహీనత వేధిస్తోంది. దీంతో పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుంది. దీంతో శారీరకంగా మానసికంగా అభివృద్ధి లోపం కనిపిస్తుంది. నీరసం, అలసట, పిల్లల్లో ఆటలు ఆడటానికి, బరువులు ఎత్తడానికి సాధారణ పనులు చేయడానికి కూడా సత్తువలేని పరిస్థితులున్నాయి.ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 20,600 మంది చిన్నారులు ఎనీమియాతో బాధపడుతున్నట్లు గణాంకాలున్నాయి.

బీపీ, షుగర్ బాధితులు ఎక్కువే...!

మానసిక ఒత్తిడి, పనిభారం, సమయానికి ఆహారం తీసుకోకపోవడం, ఆహారపు అలవాట్లు మారిపోవడం తదితర కారణాలతో జిల్లాలో బీపీ, మధుమేహం బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ఇటీవల నిర్వహించిన సర్వేలో బీపీ , షుగర్ బాధితులు పెరిగిన వారు ఉన్నట్లు సర్వేలో తేలింది.

పర్యావరణ ప్రభావం

పరిశ్రమల నుంచి విడదలయ్యే ప్రతిఘనపు మీటరుకు 500 కార్బన్ రేణువుల కంటే మించకూడదు. జిల్లాలో ఉన్న పరిశ్రమలు విడుదల చేస్తున్న విషవాయివులు అంతకంటే ఎక్కువ మోతాదులోనే గాలిలో కలుస్తున్నాయని పర్యావరణవేత్తలు అంచనా వేస్తున్నారు. జిల్లాలో నాలుగు లక్షలకు పైగా వాహనాలను వినియోగిస్తున్నారు.ప్లాస్టిక్,పంటల్లో వాడే పురుగు మందులు భూమిని కలుషితం చేస్తున్నాయి.

మారుతున్న జీవనశైలి

మారుతున్న జీవనశైలికి అనుగుణంగా ఆహారం అలవాట్లు క్రమేణా మారుతున్నాయి. ఒకప్పుడు బలవర్ధకమైన ఆహారం స్థానంలో బర్గర్లు, పిజ్జాలు,పఫ్‌లు, నూడుల్స్ లాంటి ఫాస్ట్ ఫుడ్ ఆహారపదార్థాలు వచ్చి చేరాయి. శారీరక శ్రమలేక ప్రజలు సాధారణ బరువు కంటే ఎక్కువ లావైపోతున్నారని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో వెల్లడైంది. పురుషులతో పోలిస్తే మహిళలల్లో అధిక బరువు సమస్య ఎక్కువగా ఉంది. మహిళలు 40శాతానికి పైగా అధిక బరువుతో ఉన్నట్లు తేలింది.

జిల్లా వివరాలు ఇలా

● జిల్లా జనాభా:	14.02లక్షలు
● హ్యాబిటేషన్లు:	950
● ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు:	26
● పట్టణ పీహెచ్‌సీలు:	4
● ప్రధాన ఆస్పత్రులు:	7
● ఆరోగ్య ఉపకేంద్రాలు:	103
● పల్లె దవాఖానాలు:	161
● పట్టణ దవాఖానాలు:	9
● వైద్యులు:	252

రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులు

ఖమ్మం జిల్లాలో 65 శాతం
భద్రాద్రి జిల్లాలో 57శాతం

బీపీ, షుగర్ బాధితులు ..

బీపీ : 77,277
షుగర్ : 52,677

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

డాక్టర్ నారగాని రాంప్రసాద్, జనరల్ మెడిసిన్



ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరూ శ్రద్ధ చూపాలి ఇటీవల వచ్చే వ్యాధుల్లో ఎక్కువగా సరైన ఆహారం తీసుకోకపోవడం, పరిశుభ్రత పాటించక పోవడంతోనే వస్తున్నాయి. ఆరోగ్యంగా ఉండాలంటే సరైన పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు శారీరక శ్రమ ఉండాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. స్వచ్ఛమైన గాలి,మంచి తాగునీరు తీసుకోవాలి. కరోనా సమయంలో తీసుకున్న జాగ్రత్తలన్నీ నిత్యం మనం పాటిస్తే ఏ వ్యాధులు దరిచేరవు.





సత్తుపల్లిలో..



స్నానాల లక్ష్మీపురంలో పూజల్లో పాల్గొన్న భట్టి విక్రమార్క నందిని దంపతులు



వేంసూరులో...

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఆయా పట్టణాలలో, గ్రామాలలో ఆదివారం కన్నులపండువగా శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. శ్రీరామనవమి సందర్భంగా అన్ని గ్రామాల్లో భక్తుల కోలాహలంతో జై శ్రీరామ్ నినాదాలతో దద్దరిల్లింది. భక్తులకు పులిహోర,బెల్లం పానకం, వడపప్పులు పంపిణీ చేశారు. స్నానాల లక్ష్మీపురంలో పూజల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నందిని దంపతులు, పలువురు నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. కార్యక్రమాల్లో ఆయా కమిటీల నిర్వాహకులు, గ్రామపెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



మధిరరూరల్‌లో...



ఏన్కూరులో...



చింతకానిలో...



బోనకల్‌లో...



ఎర్రుపాలెంలో...



పెనుబల్లిలో...



కారేపల్లిలో...



తల్లాడలో....



ముదిగొండలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం



కల్లూరులో....



పులిగుట్టలో జనజాతర

సాయం సంధ్యవేళ శ్రీరాముని కల్యాణం

ముదిగొండ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడైనా సీతారాముల కల్యాణం ఉదయం వేళ నిర్వహించడం జరుగుతుంది. రెండో భద్రాద్రిగా పేరుగాంచిన ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం ముత్తారం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో మాత్రం సాయం సంధ్యవేళలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. భద్రాచలంలో సీతారాముల కల్యాణం జరిగిన తర్వాత ఆ తలంబ్రాలను తీసుకొని వచ్చి ఇక్కడ కల్యాణం నిర్వహించడం జరుగుతుంది. ఈ కల్యాణ క్రతువును ఆలయ ప్రధాన అర్చకుడు బొర్రా వాసుదేవాచార్యుల బృందం నిర్వహించారు.



మంగళసూత్రం చూపిస్తున్న అర్చకుడు

సాయం సంధ్యవేళ నిర్వహించే ఈ కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టూపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

గ్రూప్-1 ర్యాంకర్‌ను సన్మానించిన డిప్యూటీ సీఎం



లక్ష్మీసాహితిని సన్మానిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వైరా, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామంలో ఆదివారం గ్రూప్-1 ర్యాంకర్ సంగెపు లక్ష్మీసాహితిని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సన్మానించారు. గ్రూప్-1లో రాష్ట్రంలో 129, మల్టీజోన్-1లో 69వ ర్యాంకు సాధించిన లక్ష్మీ సాహితిని తన సతీమణి మల్లు నందినితో కలిసి భట్టి విక్రమార్క అభినందించి సన్మానించారు. తమ గ్రామానికే చెందిన లక్ష్మీసాహితి గ్రూప్-1లో ర్యాంకు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో కూడా మరిన్ని ర్యాంకులు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, మల్లు రామకృష్ణ, మట్టూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మాస్‌లైన్ నాయకులను అరెస్టు చేయడం అన్యాయం

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ విధానాలనే కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కమిటీ కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాచలం పర్యాటన సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాస్‌లైన్ నాయకులను ముం దస్తు అరెస్టులు చేశారని విమర్శించారు. ప్రజలకు జవాబుదారిగా ప్రభుత్వాలు బాధ్య త వహించాలని, మాస్‌లైన్ ప్రజాస్వామికంగా ఉండే రాజకీయ పార్టీగా ఉందన్నారు. ఖమ్మంలో ఆవుల అశోక్, శ్రీనివాస్, ఆజాద్, మణుగూరులో ఆర్ మధుసూదన్‌రెడ్డిలను అరెస్ట్ చేయడంపై తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. పోలీసులకు విచ్చలవిడిగా అ ధికారాలను ఇచ్చి ప్రజా ఉద్యమాలను ఆపాలనుకోవడం సరైన విధానం కాదన్నారు. మరోసారి ఇటువంటి సంఘటనలు జరగ కుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామికంగా వ్యవహరించాలని కోరారు.

మహిళా రోగిపై.. ఆస్పత్రి సిబ్బంది నోటిదురుసు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు కిందపడి ఆపరేషన్ కోసం వచ్చిన ఓ మహిళ రోగిపట్ల ఆస్పత్రి వైద్యుడు, సిబ్బంది నోటిదురుసుగా, అమర్యాదగా ప్రవర్తించినట్లు ఆ మహిళ తరపు బంధువులు ఆరోపిస్తున్నారు. ఖమ్మం నగరంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో జరిగిన ఈసంఘటనపై మహిళా రోగి కుటుంబీకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. వైరాకు చెందిన మహిళ ఇంటి పనులు చేసుకుంటుంగా, కిందపడి చేయి విరిగింది. దీంతో ఖమ్మంలో ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యుడిని సంప్రదించగా ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ చేసే సమయంలో థియేటర్‌లో సదరు మహిళను థియేటర్ సహాయకులు, వైద్యుడు అమర్యాదగా మాట్లాడడంతో ఆమె తీవ్ర మనస్థాపం చెందింది. ఈ నేపథ్యంలోనే వారి తీరుతో తక్షణమే డిస్చార్జి అవుతామని పట్టుబట్టి మరీ ఇంటికి వెళ్లిపోయింది. ఈ విషయమై మహిళా తరపు కుటుంబీకులు వైద్య ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

'క్రైస్తవులు ఐక్యంగా ఉండాలి'



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న క్రైస్తవ సంఘం నాయకులు

కల్లూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల ఐక్యతను చాటి చెప్ప వలసిన అవశ్యకత ఎంతైన ఉందని అసోసియేషన్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎనోష్‌కుమార్ అన్నారు. ఆదివారం కల్లూరులో ఏఐసీసీ ఆధ్వర్యంలో ఆదివారం రన్‌ఫర్ జీసస్ పోస్టర్లను ప్రేయర్ సెల్ జిల్లా అధ్యక్షుడు నిర్మల్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరాజులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన క్రైస్తవ సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మీడియా సెల్ జిల్లా అధ్యక్షుడు దాసరి డేవిడ్‌రాజు, మండల అధ్యక్షుడు ఎబినేజర్, సంఘ నాయకులు సంజీవరావు, జాన్‌పరంజ్యోతి, దయాకర్, మహేష్, తిమెతి, సుందర్‌రాజు, జీవన్‌కుమార్, రాజశేఖర్, ఎసోబు, తదితరులున్నారు.

వైద్య శిబిరం విజయవంతం

బోనకల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బోనకల్‌లో ఆదివారం బత్తినేని చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. పలువురికి పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. తూము ప్రకాశరావు ఆశయ సాధనలో భాగంగా కొనసాగుతున్న వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, బత్తినేని ట్రస్టు సభ్యుడు తూము రోషన్ కుమార్, బొమ్మినేని కొండలరావు, ఆకేన పవన్, ఏలూరి పూర్ణచంద్, బోళ్ల ప్రసాద్ పాల్గొన్నారు.

10న టీడబ్ల్యూజేఎఫ్ సమావేశం

సత్తుపల్లి, ఏప్రిల్6 (ఆంధ్రజ్యోతి): టీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ స్థాయి సమావేశం ఈనెల 10న స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో జరుగుతుందని ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చీనేని బాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా బాధ్యులు పాల్గొంటారని, ఈ సందర్భంగా సత్తుపల్లి డివిజన్ జర్నలిస్టులకు సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. సమావేశానికి సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాలకు చెందిన జర్నలిస్టులు హాజరు కావాలని కోరారు.

108లో మహిళ ప్రసవం

పెనుబల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపెంట గ్రామానికి చెందిన ఓ గర్భిణికి తీవ్ర నొప్పులు రావడంతో 108వాహనంలో పెనుబల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రసవించింది. గ్రామానికి చెందిన సుకి అనే గర్భిణీకి నొప్పులు రావడంతో పెనుబల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే నొప్పులు అధికం కావడంతో వాహనంలోనే 108సిబ్బంది ప్రసవం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగానే ఉన్నారు. ప్రసవం చేసిన 108సిబ్బందికి సుకి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు

సత్తుపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సమాజసేవే లక్ష్యంగా దేశాభివృద్ధిని కాంక్షిస్తూ ప్రపంచంలో మనదేశాన్ని విశ్వగురు స్థానంలో నిలపాలని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంత్యోదయ సిద్ధాంతానికి పునాదిగా ఏర్పడిన బీజేపీ సమాజంలోని చిట్టచివరి నిరుపేదకు కూడా ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు చేరేలా చూడటమే పార్టీ లక్ష్యమన్నారు. ప్రతి కార్యకర్త బీజేపీని రానున్న రోజుల్లో అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈవీ.రమేష్, బాణోత్ విజయ్, సుదర్శన్ మిశ్రా, నాగస్వామి, జే.నరేష్, రహ్మతుల్లా, పాలకొల్లు శ్రీను, శివ, వసంతరావు, కార్తీక్, కృష్ణారావు, కిరణ్, రాంబాబు, నరేష్ పాల్గొన్నారు.



సత్తుపల్లిలో మాట్లాడుతున్న నంబూరి రామలింగేశ్వరరావు

తల్లాడలో...

తల్లాడ: తల్లాడ మండలంలో బీజేపీ ఆవిర్భావ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రా మాల్లో పార్టీ పతాకాలను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవీ. రమేష్, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు ఆవిష్కరించారు. మల్లవరం ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు గాదె కృష్ణారావు, మండల అధ్యక్షుడు చల్లా నాగులు, తేజావత్ బాలాజీనాయక్, పెరిక కిరణ్, చల్లా నరేష్, సమ్మెట రాంబాబు, తమ్మిశెట్టి కృష్ణ, సత్యనారాయణ, జనసేన నాయకుడు వెంకట్ పాల్గొన్నారు.

కల్లూరులో...

కల్లూరు: కల్లూరులో బీజేపీ ఆవిర్భావ వేడుకలను ఆ పార్టీ నాయకులు, అభిమానులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఈవీ. రమేష్, కుసంపూడి రవీంద్ర మండల అధ్యక్షుడు గుమ్మా రామకృష్ణ, నాయకులు గుండపనేని అనిల్, మండవ వెంకట్రామిరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జలా అప్పారావు, నాయులు పెద్దపుల్లారావు, పానుగంటి కృష్ణ, భీమారాజు, బానోతు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండలో...

ముదిగొండ: తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆపార్టీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆపార్టీ కార్యాలయం ముందు ఏర్పాటుచేసిన జెండాను బీజేపీ మండల అధ్యక్షుడు అల్లిక శ్రీకాంత్ ఎగురవేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసేదే బీజేపీ ఒక్కటేనన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ కాషాయ జెండా ఎగరడం ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాధాపురం మాజీ సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు అల్లిక శ్రీకాంత్, నాయకులు వున్నం వెంకయ్య, చావా కిరణ్, సంతోష్, సంగయ్య, ముణేశ్వరరావు, గోవర్ధన్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

పెనుబల్లిలో...

పెనుబల్లి: బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం పెనుబల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బొర్రా నర్సింహారావు పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మిశ్రా, అధికార ప్రతినిధి మధుసూదన్, సత్తుపల్లి టౌన్ మాజీ అధ్యక్షుడు నాగస్వామి, జిల్లా కౌన్సిలర్ ఓరుగంట రాము, పేర్ల మహేష్, నాగులబండి వెంకటేశ్వరరావు, కనకాల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



కల్లూరులో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

బోనకల్‌లో...

బోనకల్: మండలంలోని రావినూతల, ఆళ్లపాడు, బోనకల్ తదితర గ్రామాల్లో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షురాలు తాళ్లూరి మౌనిక మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రదాని మోదీ పని చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ, ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు తాళ్లూరి సురేష్, జంపాల రవి, కాలసాని పరుశురాం, దొంతు రాధాకృష్ణ, రామారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ముదిగొండలో...



తల్లాడలో...



బోనకల్‌లో...



పెనుబల్లిలో...